క్లుప్తంగా

చెన్నకేశ్వాపురం వాసికి డాక్టరేట్


పేరెల్లి కోటి

నడిగూడెం : మండల పరిధిలోని చెన్నకేశ్వాపురం గ్రామానికి చెందిన పేరెల్లి కోటికి ఉస్మానియ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. వ్యాయామ విద్యా విభాగంలో హిస్టారికల్ డెవలప్‌మెంట్ ఆఫ్ కబడ్డీ ఇన్ ఇండియా విత్ ఏ స్పెషల్ రిఫరెన్స్ టు తెలంగాణ స్టేట్- స్టడీ అనే అంశంపై రిటైర్డు ప్రొఫెసర్ కె.సురేందర్‌రెడ్డి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను కోటికి ఈ నెల 16న డాక్టరేట్ అందజేశారు. ఈ సందర్భంగా కోటికి ఆయన స్నేహితులు అభినందనలు తెలిపారు.

వాసవీ క్లబ్ జిల్లా చైర్మన్లుగా నేరేడుచర్ల వాసులు


రాచకొండ శ్రీనివాస్‌రావు


కందిబండ శ్రీనివాస్‌రావు

నేరేడుచర్ల : వాసవీ క్లబ్ జిల్లా ఆరోగ్య చైర్మన్‌గా రాచకొండ శ్రీనివాస్‌రావు, వాసవీ క్లబ్ జిల్లా అమ్మ చైర్మన్‌గా కందిబండ శ్రీనివాస్‌రావు నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి వారికి నియామకపత్రాలు అందజేశారు. వీరు ఇద్దరు నేరేడుచర్ల వాసులు. కాగా, వీరి నియామకం పట్ల వాసవీ, వనితా క్లబ్‌ల సభ్యులతో పాటు ఆర్యవైశ్య సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

స్టాఫ్ నర్స్‌గా సునిత

హుజూర్‌నగర్ : పట్టణంలోని మగ్దుం నగర్ బస్తీ దవాఖాన స్టాఫ్ నర్స్‌గా గుండు సునిత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు దవాఖాన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షరీఫ్‌కు ఆమె తన నియామక ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వెలిదండ వీరారెడ్డి, వి.కృష్ణగౌడ్, షేక్ సైదా పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బీమా చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీ పరిధిలోని మగ్దుంనగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త జడ నాగయ్యయాదవ్ ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ తరఫున మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు డాక్టర్ లక్ష్మీనరసింహారెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ అమర్, నాయకులు నగేష్ రాథోడ్, చంద్రమౌళి, సుందరయ్య, నాగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, శంబిరెడ్డి, బ్రహ్మారెడ్డి, పరుశురాం, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని వినతి

నేరేడుచర్ల : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందించాలని కోరుతూ శుక్రవారం నేరేడుచర్ల తహసీల్దార్ సైదులుకు బీజేపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. సంక్షేమ పథకాల అమలులో రాజకీయ జోక్యం లేకుండా చూడాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీజేపీ నాయకులు జూలూరు అశోక్, తాళ్ల నరేందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, సైదిరెడ్డి, నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ముత్తయ్య

హుజూర్‌నగర్ : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్‌ఐ ముత్తయ్య అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలోని అడ్డరోడ్డు ఇందిరా సెంటర్‌లో ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించి మాట్లాడారు. వాహనాల ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గరిడేపల్లి : మండలంలోని కల్మలచెరువు రోడ్డులో రహదారి వెడల్పులో భాగంగా గరిడేపల్లి టౌన్ ఫీడర్ కింద కల్మలచెరువు రోడ్డు పరిధిలో 11కేవీ విద్యుత్ స్తంభాలు మార్చుతున్నందున శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సాయికృష్ణ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మొక్కల పెంపకంపై దృష్టి

- గ్రామాల్లో 17 నర్సరీలు ఏర్పాటు
- 1.80 లక్షల మొక్కలు పెంచుతున్న సిబ్బంది
- నర్సరీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న అధికారులు

చిలుకూరు : పచ్చదనం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది వన మహోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ప్రతి ఏటా వర్షాకాలం మొదలు కాగానే మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతోంది. ఈ ఏడాది జూన్ నెలలో నిర్వహించబోయే వన మహోత్సవాన్ని అధికారులు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశారు. ఈమేరకు చిలుకూరు మండలంతోని గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు. ఆయా నర్సరీల్లో సంచుల్లో నాణ్యమైన ఎర్ర మట్టిని నింపి (బ్యాగ్ ఫిల్లింగ్) వాటిలో వివిధ రకాల విత్తనాలు నాటారు. వాటిని వన సంరక్షకులు నిత్యం కాపాడుతూ నీటిని అందిస్తున్నారు. అధికారులు సైతం నిత్యం నర్సరీలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నారు. నర్సరీల్లో మొక్కల పెంపకంపై ఇప్పటికే జిల్లా స్థాయి అధికారులు.. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ టీఏలు, కూలీలకు శిక్షణ ఇచ్చారు.


కొండాపురంలోని నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

ఒక్కో నర్సరీల్లో పదివేల చొప్పున..

ప్రతి గ్రామ పంచాయతీకి ఒక నర్సరీ చొప్పున చిలుకూరు మండల వ్యాప్తంగా 17 గ్రామాల్లో 17 నర్సరీలను ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామ పంచాయతీకి కనీసం 10 వేల చొప్పున 1.80 లక్షల మొక్కలు పెంచాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే లక్ష్యం మేరకు అన్ని నర్సరీల్లో సంచుల్లో మట్టిని నింపి విత్తనాలు నాటారు. అయితే ఒక్కో మొక్క పెంపకానికి కనీసం రూ.8 నుంచి రూ.10 వరకు ఖర్చు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇళ్ల, రహదారులకు ఇరువైపులా పెంచేందుకు నీడనిచ్చేవి, పూలు, పండ్ల మొక్కలను పెంచుతున్నారు. టేకు, ఈత, వెదురు, మలబారు, మునగ, వెలగ, మర్రి, వేప, బాదం, జామ, సీతాఫలం, ఖర్జురా, మందార, సన్నజాజి, మల్లె తదితర విత్తనాలు నాటారు. ప్రతి ఇంట్లో తులసి మొక్క పంపిణీ చేసే విధంగా వాటిని కూడా పెంచుతున్నారు. ఎప్పటికప్పుడు నర్సరీలను పర్యవేక్షిస్తున్నారు. మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు వన సంరక్షకులకు సూచనలు ఇస్తున్నారు. విత్తనాలు మొలక రావడానికి అవసరమైన ఉష్ణోగ్రత, ఎండిపోకుండా తరుచూ నీటి తడులు పెట్టడం, గ్రీన్ నెట్ ఏర్పాటు చేయడం లాంటి చర్యలు చేపడుతున్నారు.

17 నర్సరీలు ఏర్పాటు చేశాం



మండల వ్యాప్తంగా 17 నర్సరీల్లో 1.80 లక్షల మొక్కలు పెంచడం లక్ష్యంగా నర్సరీలు సిద్ధం చేశాం. ఇప్పటికే 1.80 లక్షల బ్యాగుల్లో విత్తనాలు విత్తినాం. మొక్కల పెంపకంపై ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది, కార్యదర్శులకు శిక్షణ, సలహాలు ఇస్తున్నాం. ఒక నర్సరీలో 10 నుంచి 12 వేల మొక్కలు పెంచుతున్నాం.

– నిర్మల, ఏపీఓ, చిలుకూరు మండలం

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

నడిగూడెం : త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలకు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం నడిగూడెం మండల కేంద్రంలోని కొల్లు కోటయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచినా ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తే సహించమన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నడిగూడెంలో మాట్లాడుతున్న మల్లయ్యయాదవ్

విస్తృతంగా లయన్స్ క్లబ్ సేవలు


మాట్లాడుతున్న ప్రసాద్

నేరేడుచర్ల : జాతీయ, అంతర్జాతీయంగా లయన్స్ క్లబ్ విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని లయన్స్ క్లబ్ నల్లగొండ డిస్ట్రిక్ వైస్ గవర్నర్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం నేరేడుచర్లలోని బెనర్జీ ఆస్పత్రిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేరేడుచర్ల క్లబ్ అధ్యక్షుడు జిలకర వీరస్వామి, సూర్యాపేట కంటి ఆస్పత్రి వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, ఉప్పల రాజేంద్రప్రసాద్, చల్లా ప్రభాకర్‌రెడ్డి, సైదిరెడ్డి, యూసుఫ్, క్రాంతికుమార్, సీతారాంరెడ్డి, శ్రీరాంరెడ్డి, రమేష్‌బాబు, విశ్వనాథం, సైదా నాయక్, తదితరులు ఉన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి


పరీక్ష నిర్వహణపై నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న సిబ్బంది

కోదాడ : నవోదయ పాఠశాలలో ప్రవేశానికి శనివారం నిర్వహించే ప్రవేశ పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కోదాడ పట్టణంలో రెండు సెంటర్లను ఏర్పాటు చేశారు. బాలుర పాఠశాలలో 170 మంది, బాలికల పాఠశాలలో 218 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. శనివారం ఉదయం 11- 30 గంటల నుంచి 1 గంట వరకు పరీక్ష ఉండనుంది. శుక్రవారం కోదాడలో ఇన్విజిలేటర్లతో నిర్వహించిన సమావేశంలో పరీక్షల సూపరింటెండెంట్ రాజు మాట్లాడారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. విద్యార్థులు గంట ముందే పరీక్షా సెంటర్‌కు చేరుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో బాలుర పాఠశాల ఇన్‌చార్జ్ మార్కెండేయ, బడుగుల సైదులు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం ఏర్పాటు

నడిగూడెం :పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని నడిగూడెం సింగిల్ విండో చైర్మన్ కొల్లు రామారావు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని శ్రీరంగాపురంలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లంజపల్లి నాగేశ్వరరావు, అల్లు ప్రసాదరావు, పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్‌కు సన్మానం


నడిగూడెంలో తిరుపతమ్మను సన్మానిస్తున్న మాదిగ ఉద్యోగుల సంఘం నాయకులు


కోదాడ : మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బషీర్‌ను అభినందిస్తున్న నాయకులు

నడిగూడెం : కోదాడ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా ఎంపికైన వేపూరి తిరుపతమ్మ, సుధీర్ దంపతులను శుక్రవారం నడిగూడెంలో మాదిగ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు, జిల్లా జాయింట్ సెక్రటరీ పాతకొట్ల ప్రకాష్, ఎస్‌ఐ పులి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వేపూరి పర్వతాలు, పిడమర్తి సైదులు, మాదాసు బాబు, కనకం అక్షపతి, బుచ్చారావు, ఈశ్వర్, రాజేశ్వరి, వీరయ్య, రాములు, నాగరాజు, కుటుంబరావు పాల్గొన్నారు.

కోదాడ : కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన ఎస్‌కె. బషీర్‌ను శుక్రవారం పలువురు వేర్వేరు కార్యక్రమాల్లో సన్మానించి అభినందించారు. కోదాడ మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలని బషీర్‌ను కోరారు. ఆయా కార్యక్రమాల్లో గుడుగుంట్ల శంకర్, కాంగ్రెస్ నాయకుడు కేఎల్ఎన్.ప్రసాద్, ఒంటిపులి వెంకటేష్, కాలిదాసు వెంకటరత్నం, గంధం పాండు, ముడెం సైదిబాబు, మైనార్టీ నాయకులు ఉన్నారు.

కబడ్డీ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం


బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

హుజూర్‌నగర్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హుజూర్‌నగర్‌లోని మాధవరాయిని గూడెంలో యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు రాష్ట్రాల గ్రామీణ స్థాయి కబడ్డీ పోటీలు ముగిశాయి. శుక్రవారం విజేతలకు బహుమతులు, షీల్డులు ప్రదానం చేశారు. బెస్ట్ రైడర్, బెస్ట్ డిఫెండర్, బెస్ట్ ఆల్ రౌండర్, బెస్ట్ టీమ్‌కు ప్రత్యేక బహుమతులు అందజేశారు. పోటీల్లో మిర్యాలగూడెం మండలం ఆలగడపకు చెందిన వల్లపుదాసు సోమయ్య మెమోరియల్ జట్టు మొదటి బహుమతి రూ.20వేలు, నేరేడుచర్ల మండలం కల్లూరుకు చెందిన మొదాల మురళి మెమోరియల్ జట్టు రెండవ బహుమతి రూ.18 వేలు గెలుపొందారు. యూత్ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన పోలీసులకు సత్కారం


కోదాడ : పదోన్నతి పొందిన వారిని సన్మానించిన స్వేరోస్ సభ్యులు


నేరేడుచర్ల : పదోన్నతి పొందిన సైదులును సన్మానిస్తున్న ఎస్‌ఐ, పోలీస్ సిబ్బంది

కోదాడ : పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి ఇటీవల ఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన వారిని శుక్రవారం కోదాడలో స్వేరోస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బలహీన వర్గాలకు చెందిన పులి వెంకటేశ్వర్లు, గుగులోత్ వెంకటేశ్వర్లు, ఎండి ఇస్మాయిల్ కష్టపడి ఈ స్థాయికి చేరడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో పేదలకు సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర కార్యదర్శి చెరుకుపల్లి కిరణ్, అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి మాతంగి ప్రభాకర్, గంధం బుచ్చారావు, పులి శ్రీనివాస్, పంది కళ్యాణ్, చలిగంటి రామారావు, బజాన్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల ఏఎస్‌ఐకి ఎస్‌ఐగా పదోన్నతి

నేరేడుచర్ల : నేరేడుచర్ల ఏఎస్‌ఐగా పనిచేస్తున్న ఏ.సైదులుకు ఎస్‌ఐగా పదోన్నతి లభించింది. ఈమేరకు సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్‌నాయక్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది లక్ష్మయ్య, వీరాంజనేయులు, సురేష్, శ్రీలత, హనుమాన్‌నాయక్, గోపి, వెంకన్న గౌడ్, అన్వర్, జ్యోతి, స్పందన తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులివ్వాలి

గరిడేపల్లి : మండలంలో అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు కోరారు. ఈమేరకు శుక్రవారం గరిడేపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేసి అనంతరం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ప్రస్తుతం వచ్చిన రేషన్ కార్డుల జాబితాలో అర్హులందరి పేర్లు రాలేదని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు త్రిపురం సుధాకర్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు కడియాల అప్పయ్య, యడ్ల అంజిరెడ్డి, కుందూరు వెంకటరెడ్డి, గోదుమల ఈశ్వరాచారి, గోవిందు, బాలకృష్ణ, చందాల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కేంద్రంలో అన్నదానం

కోదాడరూరల్ : మండలంలోని కాపుగల్లుకు చెందిన పున్న వీరబాబు ఇటీవల మృతి చెందారు. శుక్రవారం మృతుడి జయంతి సందర్భంగా మండల పరిధిలోని అశోక్‌నగర్‌లో గల మానసిక దివ్యాంగుల కేంద్రంలో అతని స్నేహితులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోపి, అభి, శ్రీను, సాయి, శివరాం ఉన్నారు.

గ్యాస్ సిలిండర్లు చోరీ చేస్తున్న వ్యక్తి అరెస్ట్

కోదాడరూరల్ : గ్యాస్ సిలిండర్లు చోరీ చేస్తున్న వ్యక్తిని శుక్రవారం కోదాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోదాడ పట్టణ స్టేషన్ కార్యాలయం ఆవరణలో సీఐ రాము కేసు వివరాలను వెల్లడించారు. మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన మామిడి శ్రీకాంత్ జల్సాలకు అలవాటు పడి డబ్బు కోసం ద్విచక్రవాహనాలను, ఇళ్లల్లోని గ్యాస్ సిలిండర్లను దొంగిలించి అమ్ముకుంటున్నాడు. పట్టణ సీఐ రంజిత్ ఆధ్వర్యంలో గుడిబండ రోడ్డులోని విశ్వబ్రాహ్మణ కాలనీ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై గ్యాస్ సిలిండర్‌తో వస్తున్న శ్రీకాంత్ పోలీసులను చూసి పరారు అవుతుండగా అతన్ని పట్టుకున్నారు. శ్రీకాంత్‌ను విచారించగా పట్టణంలో రెండు ద్విచక్రవాహనాలతో పాటు సాయినగర్, ఉత్తమ్‌పద్మావతినగర్, గోపిరెడ్డినగర్, భవానీనగర్, అనంతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 39 సిలిండర్లను చోరీ చేసి అమ్మినట్లు ఒప్పుకున్నాడు. వాటిలో 23 సిలిండర్లను రికవరీ చేశామని, వాటిని కొనుగోలు చేసిన పలువురికి నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఇంతకుముందు అతనిపై పలు చోట్ల 11 కేసులు నమోదైనట్లు సీఐ తెలిపారు. దొంగను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ రాము, ఎస్‌ఐలు రంజిత్‌రెడ్డి, సైదులుతో పాటు సిబ్బందిని డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అభినందించారు.


రికవరీ చేసిన గ్యాస్ సిలిండర్లను చూపిస్తున్న సీఐ రాము

మహిళకు రక్తదానం


రక్తదానం చేస్తున్న తిరుపతి

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన ఎన్.అంజమ్మకు ఆపరేషన్ నిమిత్తం రక్తం అవసరం కావడంతో డీఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ బాబురావును సంప్రదించారు. శుక్రవారం ఆయన రక్తదాత తిరుపతితో మాట్లాడి ఓ నెగిటివ్ రక్తాన్ని ఇప్పించారు. దీంతో వారిని పలువురు అభినందించారు.

గనుల విస్తరణపై నేడు ప్రజాభిప్రాయ సేకరణ

పాలకవీడు : మండలంలోని పెన్నా సిమెంట్ పరిశ్రమ గనుల విస్తరణ, సున్నపురాయిఉత్పత్తిసామర్థ్యాన్ని పెంపునకు శనివారం పరిశ్రమ వద్ద కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నారు. సున్నపురాయి ఉత్పత్తి సామర్థ్యాన్ని సంవత్సరానికి 1.5 నుంచి 1.8 మిలియన్ టన్నులకు పెంచుకునేందుకు గాను పరిశ్రమ వారు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకోసం ఇప్పటికే దామరచర్ల మండలం గణేష్‌పహాడ్ గ్రామ పరిధిలో పరిశ్రమ ఆధీనంలో 354 హెక్టారుల లీజ్ మైనింగ్ భూములు ఉండగా అందులో 304 హెక్టార్లు గణేష్‌పహాడ్ గ్రామ పరిధిలో ఉంది. 50 హెక్టార్లు పాలకవీడు మండలం శూన్యపహాడ్ పరిధిలో ఉంది. ఆయా భూముల్లో మైనింగ్ చేయుటకు సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అధ్యక్షతన శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. సమీప గ్రామాల ప్రజలు, పర్యావరణవేత్తలు హాజరై తమ అభిప్రాయాలు తెలియజేయనున్నారు.

గ్రామాల్లో భిన్న వాదనలు..

గనుల సమీప గ్రామాల ప్రజలు కొందరు గనుల విస్తరణను స్వాగతిస్తుండగా, మరికొందరు అడ్డుకుని తీరుతామని అంటున్నారు. ఇటీవల పరిశ్రమ నుంచి విపరీతంగా కాలుష్యం వెదజల్లుతుందని, పరిశ్రమ లాభాల కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టలేమని పలువురు చెబుతున్నారు. పంట భూముల్లో, అటవీ ప్రాంతాల్లో దుమ్ము పేరుకుపోతోందని, సామర్థ్యం పెంచితే పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు.

మాకు అభ్యంతరం లేదు.. కానీ గ్రామాన్ని అభివృద్ధి చేయాలి

పెన్నా సిమెంట్ పరిశ్రమ గనుల విస్తరణకు మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ మా గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలి. స్థానికులకు ఉపాధి కల్పించాలి. ప్రస్తుతం పరిశ్రమ అవసరం కోసం ఒకలా, తరువాత మరోలా వ్యవహరిస్తే ఊరుకునేది లేదు. ఇప్పటికే పరిశ్రమ పరిధి ప్రాంతంలో అటవీ, వ్యవసాయ భూములు, ఇళ్లలోకి దుమ్ము వస్తోంది. ఇప్పుడు మాటిచ్చి తర్వాత గ్రామాన్ని అభివృద్ధి చేయకుంటే పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తాం.

– నరినాయక్, శంకర్‌నాయక్, శూన్యపహాడ్

రోడ్లు పునర్నిర్మించాలని కమిషనర్‌కు వినతి


కమిషనర్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

హుజూర్‌నగర్ : పట్టణంలో సీసీ రోడ్లు ధ్వంసమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రహదారులను పునర్నిర్మించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పల్లె వెంకటరెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని బాబు హాస్పిటల్‌కి వెళ్లే దారిలో సత్యవతి హోటల్ నుంచి లక్కవరం బైపాస్ రోడ్డు వరకు రోడ్డు అధ్వానంగా తయారైందని తెలిపారు. ఈ రహదారిలో మండలంలోని గ్రామాలకు, మఠంపల్లి మండలానికి వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని తెలిపారు. ఈ నెలలో జరిగే చివరి పాలకవర్గ సర్వసభ్య సమావేశంలో రోడ్ల సమస్యను ఎజెండా చేర్చి రహదారులు నిర్మించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దుగ్గి బ్రహ్మం, కౌన్సిలర్ ఇందిరాల త్రివేణి, యోన, మురళి, వీరయ్య, వెంకటనారాయణ, వెంకన్న, వేణు పాల్గొన్నారు.

పీఎన్‌ఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతులు ప్రారంభం


నాటక ప్రదర్శనలో పాల్గొన్న పీఎన్‌ఎం కళాకారులు

చిలుకూరు: మండలంలోని కొండాపురం గ్రామంలో శుక్రవారం సీపీఎం అనుబంధ ప్రజా నాట్య మండలి (పీఎన్‌ఎం) జిల్లాస్థాయి శిక్షణ తరగతులను ఆ మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేల్పుల వెంకన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ కళ కోసం కాదని ప్రజలను చైతన్యం చేసేందుకేనని అన్నారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తాము కళారూపాలను ప్రదర్శిస్తున్నామని పేర్కొన్నారు. ముందుగా పీఎన్‌ఎం జెండాను ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షుడు బచ్చలకూర రాంబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు వేనేపల్లి వెంకటేశ్వరరావు, బి.కోటేశ్వరరావు, కందుల జయరాజ్, స్వరాజ్యం, నర్సింహారావు, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

సర్వే పరిశీలించిన ఆర్డీఓ


మునగాల : కొక్కిరేణిలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణ

మునగాల : రైతు భరోసా పథకం అమలులో భాగంగా మండలంలోని కొక్కిరేణి, తాడ్వాయి, కలకోవ, రేపాల రెవెన్యూ గ్రామాల్లో సాగుకు యోగ్యం కాని భూముల సర్వే కొనసాగుతోంది. శుక్రవారం వెంకట్రాంపురంలో సర్వేలో భాగంగా సాగుకు యోగ్యం కాని ఇటుక బట్టీ స్థలాన్ని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ పరిశీలించారు. ఆయన వెంట కోదాడ ఏడీఏ డి.యల్లయ్య, తహసీల్దార్ వి.ఆంజనేయులు, మండల వ్యవసాయాధికారి బుంగ రాజు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సాగుకు యోగ్యం కాని భూముల సర్వే

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని చింత్రియాల, గుడిమల్కాపురం తమ్మారం గ్రామాల్లో వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు శుక్రవారం సాగుకు యోగ్యం కాని భూముల సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ సురేందర్‌రెడ్డి, ఎంఏఓ శశాంక్, ఏఈఓలు దుర్గ భవాని, భవన్, సంధ్య, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కృష్ణానదికి హారతి


ప్రహ్లాద ఘాట్‌లో కృష్ణానదికి హారతి ఇస్తున్న అర్చకులు, భక్తులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం వద్ద జీవ నదిగా ప్రవహిస్తున్న కృష్ణవేణి నదీమ తల్లికి అర్చకులు, భక్తులు శుక్రవారం రాత్రి కృష్ణాహారతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ప్రత్యేక పల్లకీలో కృష్ణానదిలోని ప్రహ్లాద ఘాట్‌కు తరలించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి నదీమతల్లికి హారతులిచ్చారు. శ్రీస్వామి అమ్మవార్లను ఆలయ ప్రవేశం చేయించి నీరాజన మంత్ర పుష్పాలతో మహా నివేదన గావించారు. ఉదయం ఆలయంలో స్వామిఅమ్మవార్లను వధూవరులుగా అలంకరించి నిత్యకల్యాణాన్ని జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


కోదాడరూరల్ : పనులకు శంకుస్థాపన చేస్తున్న తూమాటి వరప్రసాద్‌రెడ్డి


మోతె : గోల్‌తండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కీసర సంతోష్‌రెడ్డి

మోతె : మండలంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. హుస్సేన్‌బాద్ గ్రామంలో రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు, గోల్‌తండాలో రూ.4లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. సర్వారంలో రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శంకుస్థాపన చేశారు. ఉర్లుగొండ గ్రామంలో రూ.5 లక్షలతో చేపట్టిన డ్రెయినేజీ పనులు, నర్సింహాపురంలో పశువుల కొట్టాల నిర్మాణ పనులు ప్రారంభించారు. రావికుంటతండాలో రూ. 2 లక్షలు, బోడబండ్లగూడెంలో రూ. 3 లక్షలతో చేపట్టిన సీసీరోడ్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

కోదాడరూరల్ : మండలంలోని కూచిపూడిలో ఉపాధి హామీ నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన జరుగుతుందన్నారు . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఇర్ల సీతారాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మందలపు శేషు, గద్దల వెంకటేశ్వర్లు, సుందర్‌రావు, బాబురావు, పూర్ణ, రామకృష్ణ ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

నడిగూడెం : సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరమని స్థానిక ఏఎస్‌ఐ జగన్నాథం అన్నారు. శుక్రవారం మండలంలోని వేణుగోపాలపురంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్ నేరాలపై నిర్వహించిన కళాజాతను ప్రారంభించి మాట్లాడారు. మత్తు పదార్థాలను నియంత్రించడం మనందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ప్రతాప్, యల్లయ్య, గోపయ్య, నాగార్జున, గురులింగం, కృష్ణ, చారి, గ్రామస్తులు పాల్గొన్నారు.